క్లుప్తంగా

తాగునీటి ఎద్దడిని నివారించాలి



సమస్యను పరిష్కరించాలని రహదారిపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు

చర్ల: మండలంలోని ఆర్ కొత్తగూడెం ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని నివారించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఎస్సీ కాలనీ సమీపంలోని ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో బైఠాయించి నినాదాలు చేశారు. సుమారు గంటకు పైగా ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించడంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న ఎంపీడీఓ ఈదయ్య.. వారితో ఫోన్లో మాట్లాడారు. తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న విజయ్‌గాంధీ తదితరులు

బూర్గంపాడు: మండల పరిధిలోని వేపలగడ్డ గ్రామంలో మండల ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ ప్రీమియర్ లీగ్ సీజన్–2 క్రికెట్ పోటీలను సోమవారం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు బట్టా విజయ్‌గాంధీ ప్రారంభించారు. మాట్లాడుతూ.. ఆదివాసీలు క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం మండల అధ్యక్షుడు తాటి సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు కుంజా చిన్నబ్బాయి, పాయం వెంకటేశ్వర్లు, చెర్పా వెంకటేశ్వర్లు, ఆదివాసీ సంఘ నాయకులు తాటి వెంకటేశ్వర్లు, కుంజా కృష్ణ, ఎడమ రామారావు, రాంబాబు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర సదస్సు

గుండాల: కేంద్రంలో ప్రభుత్వం తీసుకొచ్చిన యూజీసీ నూతన ముసాయిదాను వ్యతిరేకిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో మార్చి 18న నిర్వహించనున్న 'యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సు'ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ నరేందర్ పిలుపునిచ్చారు. సోమవారం పీడీఎస్‌యూ గుండాల మండల కమిటీ ఆధ్వర్యంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పీడీఎస్‌యూ గుండాల మండల నాయకులు ఆశ జ్యోతి, నందిని, శ్వేత, పూజ, పూజిత పావని గంగాభవాని సృజన, రిషిత పాల్గొన్నారు.

మహిళలే నవ సమాజ నిర్మాణకర్తలు



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న వాసవీక్లబ్ బాధ్యులు

మణుగూరుటౌన్: మహిళలు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే మెరుగైన సమాజ నిర్మాణం కోసం సమయాన్ని వెచ్చిస్తుండడం అభినందనీయమని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దోసపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. మణుగూరులో సోమవారం జరిగిన సమావేశంలో శ్రావణలక్ష్మి, లావణ్యకు కుట్టుమిషన్లు అందజేయగా.. నాగుల జ్యోతి, చిత్తలూరి ఉమ, లంకా సూర్యకుమారి, పారుపల్లి పద్మజ, బంగారు సంధ్య, దేవులపల్లి సూర్యకుమారి, దోసపాటి స్వర్ణను సన్మానించారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు చిత్తలూరి ఉమ, వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్యామ్‌తో పాటు బొగ్గవరపు అంజలి, దోసపాటి స్వర్ణ, పీసీ బండారు నర్సింహారావు, చిట్టూరి శేషుబాబు, కడవెండి విశ్వనాథగుప్తా, దింటకుర్తి బ్రహ్మయ్య, దోసపాటి నాగేశ్వరరావు, దోసపాటి ధర్మారావు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

మణుగూరురూరల్: సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిపై అసెంబ్లీలో సస్పెన్ వేటు వేయగా, దీనిని నిరసించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మణుగూరు పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాక నాగేశ్వరరావు మాట్లాడారు. నాయకులు వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీనివాస్, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, నర్సింహారావు, కృష్ణ, బి.ప్రసాద్, వి.రాంబాబు, రామకోటి, సురేష్, రవి, సృజన్ పాల్గొన్నారు.

'డివైడర్' డిజైన్ మార్చేశారా?!

- ఓ వ్యాపారికి అనుకూలంగా నిర్మాణం?
- పొంచి ఉన్న ప్రమాదాల ముప్పు



డివైడర్ నిర్మించకుండా వదిలేసిన ప్రాంతంలో యూటర్న్ తీసుకుంటున్న వాహనాలు

అశ్వారావుపేటరూరల్: కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న అశ్వారావుపేట సుందరీకరణ పనులు కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా మారుతున్నాయి. ఇప్పటికే అనేక విమర్శలతో సాగుతున్న ఈ పనుల్లో తాజాగా ఓ వ్యాపారి కోసం డివైడర్ డిజైన్‌ను మార్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అశ్వారావుపేట–బూర్గంపాడు మార్గంలో రూ.10కోట్ల వ్యయంతో రహదారి మధ్యలో డివైడర్, రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ పనులు గడిచిన ఏడాది కాలంగా సాగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా కొద్ది రోజుల క్రితమే స్థానిక సంత మార్కెట్ నుంచి రహదారి మధ్యలో డివైడర్ నిర్మాణాన్ని చేపట్టారు. కాగా, సంత మార్కెట్ నుంచి చేపట్టిన ఈ డివైడర్ నిర్మాణం వడ్డెర బజార్ వద్ద రాకపోకల కోసం కొద్ది దూరం దారి వదిలారు. ఆ తర్వాత వడ్డెర బజార్‌కు సమీపంలోనే ఉన్న ఓ పెట్రోల్ బంక్ వద్ద ఏకంగా దాదాపు 60 అడుగుల దారి వదిలేసి డివైడర్ నిర్మాణాన్ని చేపట్టడం పలు అనుమానాలకు దారి తీసింది. వాస్తవంగా పెట్రోల్ బంక్ వద్ద కుడి లేదా ఎడమ వైపులో ఒక చోట మాత్రమే డివైడర్ మధ్యలో దారి ఇవ్వాల్సి ఉంది. కానీ ఏకంగా ప్రారంభం నుంచి దాటే వరకు డివైడర్ నిర్మించకుండా వదిలేశారు. ఈ విధంగా డివైడర్ నిర్మించకుండగా వదిలేయడం వెనుక అంతర్యం ఏమిటో ఆర్అండ్‌బీ శాఖ అధికారులకే తెలియాలి.

ఆ వ్యాపారి కోసమేనా?

పెట్రోల్ బంక్ వద్ద ఓ వ్యాపారి ప్రయోజనాల కోసం డివైడర్ నిర్మాణాన్ని చేయకుండా వదిలేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఆయన లావాదేవీలకు ఎలాంటి అడ్డు రాకుండా ఉండేందుకు ఈ మార్పు చేసి నిర్మిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కాగా, ఈ డిజైన్ మార్పు వెనుక పెద్ద ఎత్తున నగదు చేతులు మారినట్లు ప్రచారం సాగుతుండగా.. వ్యాపారి తెర వెనుక వ్యవహారం నడిపినట్లు తెలుస్తోంది. ఆర్థిక ప్రయోజనాలతో ఆ వ్యాపారి కోసం డిజైన్‌ను అనధికారికంగా మార్పు చేసినట్లు బహిరంగంగానే విమర్శలు వస్తున్నాయి.

ప్రమాదాలకు అవకాశం..

డివైడర్ డిజైన్‌ను ఆ వ్యాపారి ప్రయోజనాల కోసం మార్పు చేశారా లేదా.. అన్న విషయాన్ని పక్కన పెడితే.. ఇలా ఇష్టారాజ్యంగా నిర్మాణం చేయడం మాత్రం ప్రమాదకరం. ఆ ప్రదేశంలో రోడ్డు ప్రమాదాలు జరిగే విధంగా పరిస్థితి నెలకొంది. దాదాపు 60 అడుగుల మేర డివైడర్ మధ్యలో దారి వదిలిన కారణంగా.. ఈ ప్రాంతం వాహనదారులు ఒక్కసారిగా యూటర్న్ తీసుకునే విధంగా ఉంది. దీంతో ప్రమాదాలకు దారి తీసేలా ఉంది.

ఒక వైపు మాత్రమే దారి ఇస్తాం..

పెట్రోల్ బంక్ వద్ద నిర్మిస్తున్న డివైడర్ ఇంకా పూర్తి కాలేదు. ఒక వైపు మాత్రమే దారి ఇచ్చే విధంగా నిర్మిస్తాం. నిర్మాణదారుల అవగాహన లోపం కారణంగా ఈ తప్పిదం జరిగింది. ఇప్పటికే బంక్ వద్ద ఒక వైపు మాత్రమే దారి వదిలి, పూర్తి స్థాయిలో డివైడర్‌ను నిర్మించేలా ఉన్నతాధికారులు సదరు కాంట్రాక్టర్‌కు చెప్పారు. నగదు చేతుల మారినట్లు జరిగే ప్రచారం మా దృష్టికి రాలేదు.

– రామిశెట్టి శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఏఈఈ, అశ్వారావుపేట

బస్టాండ్‌లో ఎమ్మార్పీకి మించి ధరలు



మజా బాటిళ్లకు అధికంగా వసూలు చేసినట్లు చూపుతున్న ప్రయాణికుడు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌లోని స్టాల్స్ నిర్వాహకులు ప్రయాణికులను నిలువు దోపిడీ చేస్తున్నారు. వాటర్ బాటిల్ నుంచి కూల్ డ్రింక్స్ వరకు ప్రతీ వస్తువుపై అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఇదే క్రమంలో సోమవారం ఒడిశా నుంచి వైద్యం నిమిత్తం పడిమల్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలం వచ్చాడు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్టాండ్‌లోని ఓ దుకాణంలో మజాను కొనుగోలు చేసేందుకు ప్రయత్నించగా.. ఎమ్మార్పీ ధర రూ.40కి బదులు రూ.50లు వసూలు చేశారు. అదే విధంగా దుమ్ముగూడెంకు చెందిన మరోక వ్యక్తి ఇంకో దుకాణంలో ఓ లీటర్ వాటర్ బాటిల్ కొనుగోలు చేయగా రూ.20కి బదులు రూ.25లు వసూలు చేశారు. అనంతరం భద్రాచలంకు చెందిన మరో వ్యక్తి దగ్గర లీటర్ మజాకు రూ.20కి బదులు రూ.25 అడిగారు. ఇదేంటని ప్రశ్నిస్తే కూలింగ్ పెట్టాం కాబట్టి అదనంగా తీసుకుంటున్నామని బదులిచ్చారు. దీంతో సదరు వ్యక్తి విషయాన్ని డిపో అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లారు. అధికారులు వచ్చి స్టాల్ నిర్వాహకులను ప్రశ్నించగా.. రూ.5లు తిరిగి ఇవ్వడానికి ప్రయత్నించాడు. ఇప్పటికైనా ఆర్టీసీ సంబంధిత స్టాళ్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్రీడా పాఠశాలకు ఎంపికలు



దమ్మపేట: పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

దమ్మపేట: జిల్లా పరిధిలోని కాంచనపల్లి, కిన్నెరసాని క్రీడా పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఎంపిక ప్రక్రియను మండల పరిధిలోని అంకంపాలెం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ ఎంపికలో భాగంగా ముందుగా విద్యార్థుల విద్యార్హత ధ్రువ పత్రాలను పరిశీలించారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పలు క్రీడా పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, క్రీడా అధికారి గోపాలరావు, పీడీలు వట్టం వెంకన్న, రామారావు, పీఈటీలు అశోక్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం ఆశ్రమ పాఠశాలలో సోమవారం క్రీడా పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఎంపికలు నిర్వహించారు. కిన్నెరసానిలో బాలురు, కాచనపల్లిలో బాలికల క్రీడా పాఠశాలలకు ఎంపికలు చేపట్టారు. హాజరుకాని విద్యార్థులు నేడు ఏహెచ్ఎస్ ఆర్లగూడెం పాఠశాల నందు ఎంపికలకు హాజరు కావాలని ఐటీడీఏ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏటీడీఓ అశోక్, ఏఎస్ఓ నాగేశ్వరరావు, హెచ్‌ఎం చందు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 64 రద్దుకు నిరసన



చర్ల: ఉంజుపల్లి ఆశ్రమ పాఠశాల వద్ద ధర్నా నిర్వహిస్తున్న డైలీవేజ్ కార్మికులు

చర్ల: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్ డైలీ వేజ్ వర్కర్ల వేతనాలను తగ్గించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నం.64ను రద్దు చేయాలని, కనీస వేతనాల గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణా ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని ఉంజుపల్లి, పెద్దమిడిసిలేరు, సత్యనారయణపురం, చర్ల బాలికల హాస్టళ్ల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మచ్చా రామారావు మాట్లాడారు. జీఓ 64తో డైలీవేజ్ వర్కర్లకు ఇప్పటి వరకు చెల్లిస్తున్న రూ.26,220ల జీతం రూ.11,700కు తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డైలీవేజ్ వర్కర్లు భద్రమ్మ, సడాలమ్మ, రాము, వెంకట్రావు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: జిల్లా కలెక్టర్ కనీస వేతనాల గెజిట్ ప్రకారం డైలీవేజ్ వర్కర్లకు వేతనాలు చెల్లించేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ అన్నారు. సోమవారం లక్ష్మీనగరం బాలికల ఆశ్రమ పాఠశాల ఎదుట డైలీవేజ్ వర్కర్ల జీతాలు తగ్గించే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా డైలీవేజ్ వర్కర్లు నిరవధిక సమ్మెను చేపట్టారు.ఈ సందర్భంగా పద్మ మాట్లాడారు. వర్కర్ల వేతనాలు తగ్గించే జీవో 64 రద్దు చేయాలని, లేదంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచి వంశీకృష్ణ, హాస్టల్ డైలీవేజ్ వర్కర్లు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు

దమ్మపేట: బీఆర్ఎస్ పార్టీకు చెందిన నాయకులను, పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేసి, స్టేషన్‌కు తరలించారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో.. హైదారాబాద్‌లో అల్లర్లు జరగకుండా నిరోధించడానికి దమ్మపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన వారిలో దారా యుగంధర్, ఉయ్యాల చినవెంకటేశ్వరరావు ఉన్నారు.

పదో సారి రక్తదానం

భద్రాచలంటౌన్: అరుదైన ఓ నెగటివ్ రక్తాన్ని ఫైర్ మాన్ బండారి సతీష్ పదో సారి దానం చేశారు. కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో కొత్తగూడెం పట్టణానికి చెందిన మహిళ జయలక్ష్మికి జ్వరం, రక్త కణాల సంఖ్య పడిపోవడంతో వైద్యులు ఎమర్జెన్సీగా రక్తం ఎక్కించాలని సోమవారం సూచించారు. కావాల్సిన బ్లడ్ గ్రూప్ అరుదైన ఓ నెగిటివ్ కావడంతో కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతుండగా.. మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కొత్తగూడెం ఫైర్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి ఫైర్ మాన్ బండారి సతీష్ రక్తదానం చేశారు. పలువురు ఆయనను అభినందించారు.

ఇళ్లు పూర్తి చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని మనుబోతుల చెరువు కాలనీలో అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన డబుల్ బెడ్రూం ఇళ్లను పూర్తి చేసి అర్హులకు కేటాయించాలని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్ రాజ్ అన్నారు. స్థానిక ఏఎంసీ కాలనీలో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్మించి వదిలేసిన ఇళ్లకు ఇందిరమ్మ పథకం వర్తింపజేసి పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో కిశోర్, నాని, కిట్టు, ఏసుబాబు, శాంతి, రాజు, వంశీ పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

మణుగూరురూరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు అధ్యక్షుడు నల్లగట్ల సత్యప్రకాష్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన సింగరేణి పాఠశాల విద్యార్థులు డి.సాయినాథ్, ఎం.భానుప్రసాద్‌లకు సోమవారం పీవీ కాలనీలోని సింగరేణి పాఠశాలలో బహుమతులు అందజేశారు. అనంతరం టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులందరికీ పరీక్ష ప్యాడ్లు, ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సత్యప్రకాష్, అడ్వైజర్ గాజుల రమేష్, కార్యదర్శి మీరాహుస్సేన్, సింగరేణి పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు ఆర్.కల్యాణి, ఉపాధ్యాయులు ఎం.కృష్ణబాబు, బి.సరిత, కె.రాజసింహ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారావు మరణం తీరని లోటు

గుండాల: ఆళ్లపల్లి మండల పరిధిలో మర్కోడు గ్రామ పంచాయతీ జిన్నెలగూడెం గ్రామానికి చెందిన కొమరం నర్సింహారావు దొర గుండెపోటుతో మరణించటం బాధ కరమని, ఆయన లేని లోటు ఆదివాసీ ఉద్యమానికి తీరని లోటు అని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు అన్నారు. ఆయనకు సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో కొమరం హనుమంత రావు, మాజీ జెడ్పీటీసీ పడిగ సమ్మయ్య మాజీ ఎంపీపీ పాయం రామనర్సయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, ఆదివాసీ ఐక్య కార్యాచరణ మండల అధ్యక్షుడు పాయం రమేష్, ఆదివాసీ ఉద్యోగులు కొమరం రాంబాబు, పాయం పురుషోత్తం, మాజీ సర్పంచ్ శంకర్ బాబు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీఓగా వెంకటేశ్వర్లు



ఇన్‌చార్జ్ ఎంపీఓ వెంకటేశ్వర్లుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీఓ రేవతి

ములకలపల్లి: ములకలపల్లి ఇంచార్జ్ ఎంపీఓగా కవర్తి వెంకటేశ్వర్లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇన్నాళ్లు ఇక్కడ ఎంపీఓగా విధులు నిర్వహించిన లక్ష్మయ్య పదవీ విరమణ పొందిన విషయం విదితమే. కాగా పూసుగూడెం జీపీ సెక్రటరీగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లుకు సోమవారం ఎంపీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎంపీడీఓ గద్దె రేవతి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేశారు.

క్షయ వ్యాధిపై అవగాహన



క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ పావని రెడ్డి

భద్రాచలంఅర్బన్: క్షయ వ్యాధి బారినపడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని క్షయవ్యాధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పావని రెడ్డి కోరారు. సోమవారం భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఆవరణలోని జిల్లా అదనపు క్షయనివారణ కేంద్రం వద్ద టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు క్షయ వ్యాధి (టీబీ) పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్షయవ్యాధి బాధితులకు ప్రభుత్వం అందిస్తున్న న్యూట్రీషన్ కిట్లతో పాటు నిత్యవసర సరుకులను డాక్టర్ పావని పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాక్టివ్ కేస్ ఫైండింగ్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, జాతీయ క్షయవాధి నిర్మూలన కార్యక్రమం సిబ్బంది పాల్గొన్నారు.

చట్టబద్ధత కల్పించాలి

దుమ్ముగూడెం: ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ కొప్పుల తిరుపతి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో ఎమ్మార్పీఎస్ అధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టడాన్ని నిరసిస్తూ.. దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాటాడారు. సీనియర్ నాయకులు మల్లూరు పాల్గొన్నారు.

అశ్వాపురం: ఎస్సీ వర్గీకరణ చట్టం రాకముందే గ్రూప్స్ పరీక్షల ఫలితాలను ప్రకటించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఇసంపల్లి కృష్ణ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపడుతున్న నిరాహారదీక్షలు సోమవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంఘం నాయకులు మడిపల్లి రమేష్, అలవాల నాగరాజు, కొమ్ము రాంబాబు, శెట్టిపల్లి శేఖర్, ఇసంపల్లి కొండయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి సాయం

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని విఠల్‌రావునగర్‌కి చెందిన మాలోత్ కృష్ణ అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమవగా.. విషయం తెలుసుకున్న స్థానిక శ్రీరాం యూత్ కమిటీ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. రావుల కృష్ణ ఆర్థిక సహకారంతో సోమవారం సాయంత్రం రూ.1100 నగదుతో పాటు 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని గుర్తించి సాయమందించిన రావుల కృష్ణను అభినందించారు. శ్రీరాం యూత్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాద బాధితులకు..

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామంలో ఇటీవలే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన కుంజా కేశవరావు కుటుంబానికి మాజీ సర్పంచ్ తాటి బిక్షం సమక్షంలో సోమవారం శ్రీరామ్ సోమయ్య, శ్రీరామ్ రాము, ఆర్‌కె.రాము, కుంజా కృష్ణల సహకారంతో రూ.2వేల నగదు, 25కేజీల బియ్యాన్ని వితరణగా అందజేశారు.

మకర తోరణం వితరణ



మకర తోరణం అందజేస్తున్న కేశవరెడ్డి దంపతులు

అశ్వాపురం: మండల పరిధిలోని సంద్రలబోడు గ్రామ పంచాయతీలోని బండ్లసిరిగుట్టపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, అశ్విని దంపతులు వితరణ చేశారు. సోమవారం రూ.60 వేలు విలువ గల మకర తోరణాన్ని వారు అందజేశారు.

పరీక్ష సామగ్రి అందజేత

బూర్గంపాడు: మోరంపల్లిబంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష సామగ్రిని వితరణగా అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ జమలారెడ్డి చేయూత ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎమ్ ఆదినారాయణ, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కై పు సుబ్బరామిరెడ్డి, మేడం లక్ష్మీనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి భవాని, చేయూత ట్రస్ట్ చైర్మన్ కైపు లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ కైపు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కిరెడ్డి మల్లారెడ్డి, కోశాధికారి పుట్టి రాజేష్, సహాయ కోశాధికారి గాదె నర్సిరెడ్డి, శనగ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష సామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ టి.రమ హాజరయ్యారు. కొప్పుల మురళి, బాలరాజు, చైతన్య, నవీన్, వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు.


సాగునీరు అందించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలో ఆదివాసీ కొండరెడ్లు సాగు చేస్తున్న భూములకు విద్యుత్ సౌకర్యం కల్పించి సాగు నీరు అందించాలని ఆదివాసీ కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు ముర్ల రమేష్ అన్నారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించి ఐటీడీఏ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండరెడ్లు వ్యవసాయం చేయడానికి సరైన సాగు నీటి సౌకర్యం లేక నష్టలు చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మురళి కృష్ణ, రాముడు, దుర్గరావు, ముత్యాలు, వెంకటేశ్వరరావు, లక్ష్మణుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు

గుండాల: ఆళ్లపల్లి మండల కేంద్రంలో అనేక సంవత్సరాలుగా ప్రజల అవసరాల నిమిత్తం ఉన్న రోడ్డున ఆక్రమణ చేసిన వ్యక్తిపై తక్షణమే క్రిమినల్ కేసులు పెట్టాలని సోషల్ వర్కర్ సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్, జలాల్, స్థానికులు డాక్టర్ శ్రీనివాస్, తెలగాని శ్రీనివాస్, ఎండి.ఖయ్యూం, బుర్ర వెంకన్న, వెంకటేష్, సత్తార్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎస్సై రతీష్, తహసీల్దార్ శకుంతలకు వినతిపత్రం అందించారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపట్టాల కోరారు.

పాఠశాలల్లో ఫేర్ వెల్ డే



మణుగూరురూరల్: విద్యార్థినుల నృత్యం..

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే ఘనంగా జరిగింది. ఈ వేడుకను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యశోధ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలం నరసాపురం గ్రామంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బెక్కంటి శ్రీనివాసరావు మాట్లాడారు. రానున్న పరీక్షల్లో పది విద్యార్థులు మంచి ఫలితాలతో పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పాఠశాల పూర్వ హెచ్‌యం బోళ్ల వెంకటేశ్వర్లు పాఠశాల అభివృద్ధి కోసం రూ.పదివేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రత్నకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లు, అంగన్‌వాడీల నిరసన

అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పలు చోట్ల నిరసనలు వ్యక్తం చేశారు. కనీస వేతనాలు, పీఎఫ్ అమలు చేయడంతోపాటు పీఎంశ్రీ పథకం, జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఐసీడీఎస్ కార్యాలయాలు, ప్రధాన సెంటర్ల వద్ద దీక్షలు చేపట్టారు. వేతనాలు పెంపు, బకాయిలు చెల్లింపు, ప్రమోషన్లు ఇతర డిమాండ్లతో ఆశావర్కర్లు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



దుమ్ముగూడెం: దీక్షలో మాట్లాడుతున్న నాయకులు వంశీకృష్ణ, పద్మ



దమ్మపేట: తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లు



మణుగూరురూరల్: ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



బూర్గంపాడు: సీడీపీఓకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు



అశ్వారావుపేట: ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అర్జున్